వర్షకు కాంస్యం

జాతీయ స్కూల్‌గేమ్స్ చాంపియన్‌షిప్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాంచీ(జార్ఖండ్) వేదికగా జరుగుతున్న 67వ జాతీయ స్కూల్‌గేమ్స్ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ సైక్లిస్ట్ వర్షారెడ్డి కాంస్య పతకంతో మెరిసింది. సోమవారం జరిగిన బాలికల అండర్-17 20కి.మీ రోడ్ రేసులో బరిలోకి దిగిన వర్షారెడ్డి 38.00.45 సెకన్ల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో పోటీపడ్డ అసవరీ (మహారాష్ట్ర), తబిత (తమిళనాడు) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు.

రాహుల్ ఔట్

ఇంగ్లండ్‌తో మూడో టెస్టుకు దూరం

రాజ్‌కోట్: ఇంగ్లండ్‌తో జరగనున్న మూడో టెస్టుకు సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ దూరమయ్యాడు. గాయం నుంచి రాహుల్ ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో అతడిని తప్పిస్తున్నట్లు బీసీసీఐ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. అతడి స్థానంలో కర్ణాటకకే చెందిన లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్‌ను జట్టుకు ఎంపిక చేసింది. హైదరాబాద్‌లో జరిగిన తొలి టెస్టు అనంతరం వైజాగ్ మ్యాచ్‌కు దూరమైన రాహుల్ బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో పునరావాసం పొందాడు. దీంతో మిగిలిన మూడు టెస్టుల కోసం సెలెక్షన్ కమిటీ రాహుల్‌ను ఎంపిక చేసింది. అయితే మ్యాచ్ ఆరంభానికి మరో రెండు రోజులు మాత్రమే సమయం ఉండగా.. రాహుల్ 90 శాతం మాత్రమే కోలుకోవడంతో అతడిని తప్పించారు. 'రాజ్‌కోట్ టెస్టుకు రాహుల్ దూరమయ్యాడు. ప్రస్తుతం 90 శాతం కోలుకున్న అతడిని బీసీసీఐ వైద్య బృందం పర్యవేక్షిస్తున్నది' అని బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. సీనియర్లు పుజారా, రహానే జట్టుకు దూరం కాగా.. కోహ్లీ ఈ సిరీస్‌కు అందుబాటులో లేకుండా పోయాడు. శ్రేయస్ అయ్యర్ కూడా మిగిలిన మూడు మ్యాచ్‌లకు ఎంపిక కాలేదు. ఇప్పుడు రాహుల్ కూడా లేకపోవడంతో.. మిడిలార్డర్‌లో అనుభవరాహిత్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. మరోవైపు వికెట్ కీపర్ బ్యాటర్, తెలుగు ఆటగాడు శ్రీకర్ భరత్ స్థానంలో మూడు టెస్టులో ధ్రువ్ జురెల్ ఆడే అవకాశాలు కనిపిస్తున్నాయి. సర్ఫరాజ్ ఖాన్ రాజ్‌కోట్‌లో అరంగేట్రం చేయడం లాంఛనమే!



సెమీస్‌లో టీమ్ అల్ఫా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ సీజన్-4లో టీమ్ అల్ఫా సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. సోమవారం ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన క్వార్టర్స్ పోరులో టీమ్ అల్ఫా 45-35తో రఫ్ రైడర్స్‌పై అద్భుత విజయం సాధించింది. మరో క్వార్టర్స్‌లో సమా ఏంజెల్స్ 80-0తో టూటోరూట్‌పై గెలిచి టోర్నీలో ముందంజ వేసింది. ఆఖరి వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన మరో పోరులో విల్లాజియో హైల్యాండర్స్ 50-30తో మావెరిక్స్‌ను ఓడించింది. హైల్యాండర్స్ కెప్టెన్ నిఖిల్ మాథూర్ తన ఆఖరి షాట్ ద్వారా జట్టు విజయంలో కీలకమయ్యాడు. సెమీస్‌లో డీఎస్ఆర్-సమా ఏంజెల్స్, టీమ్ అల్ఫా-హైల్యాండర్స్ మధ్య పోరు జరుగనుంది.

హైదరాబాద్‌లో ఎఫ్ఐఎమ్ వరల్డ్‌కప్

ముంబై: ప్రతిష్ఠాత్మక ఎఫ్ఐఎమ్ ఈ-ఎక్స్‌ప్లోరర్ వరల్డ్‌కప్ సీజన్-2కు భారత్‌లో తొలిసారి హైదరాబాద్ నగరం ఆతిథ్యమివ్వబోతున్నది. 2024 షెడ్యూల్‌ను అనుసరించి ఇప్పటికే ఒసాకా(జపాన్) వేదికగా ఈ నెల 16, 17తేదీల్లో మొదటి రౌండ్ జరుగనుండగా, నార్వే (రౌండ్-2, మే 3-4), ఫ్రాన్స్(రౌండ్-3, జూన్ 21-23), స్విట్జర్లాండ్ (రౌండ్-4, సెప్టెంబర్ 20-22), హైదరాబాద్(రౌండ్-5, నవంబర్ 29, డిసెంబర్ 1) పోటీలు ఉండనున్నాయి. ఈ విషయాన్ని భారత్ తరపున బరిలోకి దిగుతున్న ఇండీ రేసింగ్ టీమ్ యజమాని అభిషేక్‌రెడ్డి సోమవారం పేర్కొన్నారు. దేశంలో తొలిసారి జరుగబోతున్న ఈ-మోటార్ రేసింగ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఇండీ రేసింగ్ టీమ్‌లో సాంద్రా గోమెజ్, స్పెన్సర్ విల్టన్ పోటీకి దిగుతున్నారు.

సౌరభ్ తివారీ వీడ్కోలు

న్యూఢిల్లీ: భారత సీనియర్ క్రికెటర్ సౌరభ్ తివారీ ప్రొఫెషనల్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. రంజీ ట్రోఫీలో భాగంగా ఈ నెల 16 నుంచి రాజస్థాన్‌తో మ్యాచ్ అనంతరం వీడ్కోలు పలకనున్నట్లు వెల్లడించాడు. మహేంద్రసింగ్ ధోనీ అడుగుజాడల్లో జార్ఖండ్ నుంచి వచ్చిన సౌరభ్ తివారీ కెరీర్ ఆరంభంలో భారీ హిట్టింగ్‌తో మరో జులపాల ధోనీగా గుర్తింపు పొందాడు. టీమ్‌ఇండియా తరపున మూడు వన్డేలు ఆడిన 34 ఏండ్ల తివారీ.. ఐపీఎల్లో నాలుగు ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించాడు. 2008లో విరాట్ కోహ్లీ సారథ్యంలో అండర్-19 ప్రపంచకప్ గెలిచిన జట్టులో తివారీ సభ్యుడిగా ఉన్నాడు. 'ఇదే సరైన సమయం అనుకుంటున్నా. జాతీయ జట్టుతో పాటు ఐపీఎల్ పోటీలో లేనప్పుడు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ.. యువ ఆటగాళ్ల అవకాశాలను కాలరాయడం సరికాదు' అని సౌరభ్ పేర్కొన్నాడు. 2010లో జాతీయ జట్టుకు ఎంపికైన సౌరభ్.. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 47.51 సగటుతో 8030 పరుగులు చేశాడు.

షైనింగ్ స్టార్ త్రిష

నిలకడగా రాణిస్తున్న భద్రాచలం క్రికెటర్ • డబ్ల్యూపీఎల్‌లో గుజరాత్ జట్టుకు ఎంపిక

జాతీయ స్థాయిలో మరో తెలంగాణ యువ క్రికెటర్ రివ్వున దూసుకొచ్చింది. ప్రతిభను నమ్ముకుంటూ, అవకాశాలను అందిపుచ్చుకుంటూ దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నది. సోదరున్ని స్ఫూర్తిగా తీసుకుంటూ ఎనిమిదేండ్ల ప్రాయంలోనే క్రికెట్ బ్యాట్ పట్టిన త్రిషా పూజిత భళా అనిపిస్తున్నది. 12 ఏండ్లకు హైదరాబాద్ టీమ్‌కు ఎంపికైన ఈ భద్రాచలం అమ్మాయి మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్‌ల విలువైన సలహాలు, సూచనలు పాటిస్తూ కీలక ప్లేయర్‌గా ఎదిగింది. వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ జెయింట్స్ టీమ్‌కు ఎంపికైన త్రిషతో.. నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ.

పువ్వు పుట్టగానే పరిమళించింది అన్నట్లు పసిప్రాయంలోనే క్రికెట్‌ను అమితంగా ప్రేమించిన త్రిష అనతికాలంలోనే అత్యున్నత స్థాయికి చేరింది. తన సోదరున్ని స్ఫూర్తిగా తీసుకుంటూ క్రికెట్‌ను ఇష్టపడ్డ ఈ యువ ప్లేయర్ దేశవాళీ క్రికెట్‌లో తనదైన మార్క్‌తో దూసుకెళుతున్నది. హైదరాబాద్ మహిళల టీమ్‌లో కీలక ప్లేయర్‌గా ఎదిగిన త్రిష..భవిష్యత్‌లో భారత సీనియర్ జట్టుకు ఆడాలన్న పట్టుదలతో ముందుకెళుతున్నది. త్వరలో మొదలుకాబోతున్న డబ్ల్యూపీఎల్‌లో గుజరాత్ జెయింట్స్‌కు ఎంపికైన ఈ లెఫ్ట్ హ్యాండర్ బ్యాటర్ క్రికెటర్ అమె మాటల్లోనే..

డబ్ల్యూపీఎల్‌కు ఎంపిక కావడంపై?

❖ డబ్ల్యూపీఎల్‌కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. భారత స్టార్ క్రికెటర్లతో పాటు పలువురు విదేశీ ప్లేయర్లతో కలిసి ఆడేందుకు ఆసక్తితో ఎదురుచూస్తున్నాను. ఈ నెల 23 నుంచి బెంగళూరు వేదికగా డబ్ల్యూపీఎల్ మొదలవుతున్నది. డబ్ల్యూపీఎల్‌లో సత్తాచాటడం ద్వారా మరింత వెలుగులోకి వచ్చేందుకు ప్రయత్నిస్తాను.

భవిష్యత్ లక్ష్యాలు ఏంటీ?

❖ భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టమైన విజన్‌తో ఉన్నాను. డబ్ల్యూపీఎల్‌లో సీనియర్ క్రికెటర్లతో కలిసి ఆడటం ద్వారా మరింత పరిణతి సాధించేందుకు ఆస్కారం లభిస్తుంది. రానున్న రోజుల్లో ఎలాగైనా జాతీయ జట్టుకు ఆడాలన్న పట్టుదలతో ఉన్నాను. ఇందుకోసం ఎంతైనా కష్టపడేందుకు సిద్ధంగా ఉన్నాను.

కుటుంబ ప్రోత్సాహంపై?

❖ ప్రస్తుతం నేను ఈ స్థాయిలో ఉండటానికి కుటుంబం ఇచ్చిన ప్రోత్సాహమే ప్రధాన కారణం. ఊహ తెలియని వయసులో అన్నయ్య క్రికెట్ ఆడటం చూసి ఆట పట్ల ఆకర్షణ పొందాను. అన్నయ్య ఆడగా లేనిది నేను ఎందుకు ఆడొద్దంటూ వచ్చిన ఆలోచనే ఇప్పుడు ఈ స్థాయిలో నిలబెట్టింది. చిన్నతనం నుంచి నాన్న కృష్ణారావు, అన్నయ్య రుత్విక్ ఇచ్చిన మద్దతు మరువలేనిది. వీరికి తోడు ఓవైపు ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తున్న అమ్మ ఎప్పుడు అండగా ఉంటూనే వస్తుంది.

కెరీర్ ఎలా మొదలైంది?

❖ నేను పుట్టింది భద్రాచలంలో. కెరీర్ కోసం మేము హైదరాబాద్‌కు మకాం మార్చాం. తార్నాకలో ఉంటూ తొలుత కోచ్ శ్రీనివాస్ దగ్గర ఓనమాలు దిద్దాను. ఎనిమిదేండ్లకే కెరీర్ మొదలు పెట్టి 12 ఏండ్లకు హైదరాబాద్ టీమ్‌కు ఎంపికయ్యాను. అప్పటి నుంచి ఇప్పటి వరకు అండర్-16, 19, 23 వయసు విభాగాల్లో ప్రాతినిధ్యం వహిస్తూ ఉన్నాను. ప్రస్తుతం లింగంపల్లిలో కోచ్ సలాం బయాష్ దగ్గర ట్రైనింగ్ తీసుకుంటున్నాను. టెక్నిక్ పరంగా మరింత మెరుగయ్యేందుకు ప్రయత్నిస్తున్నాను. దీనికి తోడు భారత మాజీ ఫీల్డింగ్ కోచ్ ఆర్ శ్రీధర్ దగ్గర ఫిట్‌నెస్ పరంగా శిక్షణ తీసుకుంటున్నాను. మొత్తంగా రోజుకు ఏడు, ఎనిమిది గంటలు ప్రాక్టీస్‌లో నిమగ్నమవుతాను. ప్రస్తుతమున్న పోటీ వాతావరణాన్ని ఎదుర్కొనేందుకు అన్ని రకాలుగా ముందుండాలి. అప్పుడే మరో స్థాయికి ఎదుగుతామన్నది నా నమ్మకం.

నిలకడగా ఎలా రాణిస్తున్నారు?

❖ జట్టులో చోటు నిలుపుకోవాలంటే నిలకడ అనేది ముఖ్యం. నేను అండర్-16 ఆడినప్పటి నుంచి ఇదే సూత్రాన్ని పాటిస్తున్నాను. గత ఐదేండ్ల కాలంలో వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణిస్తున్నాను. ఓపెనింగ్ బ్యాటింగ్‌తో పాటు ఉపయుక్తమైన స్పిన్ బౌలింగ్‌తో జట్టు విజయాల్లో భాగమవుతున్నాను. ఇదే ఒరవడి రానున్న రోజుల్లోనూ కొనసాగిస్తాను. ఈ క్రమంలో హెచ్‌సీఏ అందిస్తున్న సహకారం మరులేనిది. ముఖ్యంగా జగన్‌మోహన్‌రావు చాలా ప్రోత్సహిస్తున్నారు.

నాగల్ @ 98

న్యూఢిల్లీ: ఇటీవలి కాలంలో నిలకడగా రాణిస్తున్న భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నాగల్.. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తొలిసారి టాప్-100లో చోటు దక్కించుకున్నాడు. తాజాగా చెన్నై ఓపెన్ టైటిల్ నెగ్గిన నాగల్.. సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియా ఓపెన్ మెయిన్ డ్రాలో టాప్-30 ప్లేయర్‌పై నెగ్గి సంచలనం నమోదు చేసిన విషయం తెలిసిందే. సోమవారం విడుదలైన ఏటీపీ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో నాగల్ 23 స్థానాలు ఎగబాకి 98వ ర్యాంక్ దక్కించుకున్నాడు. భారత్ నుంచి టాప్-100లో ప్రస్తుతం నాగల్ ఒక్కడే ఉన్నాడు. చివరిసారిగా 2019లో ప్రజ్నేశ్ గుణేశ్వరన్ తర్వాత భారత్ నుంచి ఓ ఆటగాడు వందలోపు ర్యాంక్ పొందడం ఇదే తొలిసారి.

అమెరికాలో అత్యంత ప్రాచుర్యం పొందిన సూపర్‌బౌల్‌లో కన్సాస్ సిటీ చెఫ్స్ విజేతగా నిలిచింది. వేగాస్ సిటీ వేదికగా ఆదివారం హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో కన్సాస్ సిటీ 25-22తో సాన్ ఫ్రాన్సిస్కో 49ఈఆర్ఎస్‌పై అద్భుత విజయం సాధించింది.

75 రోజులు.. ముగ్గురు పోలీస్ కమిషనర్లు!

- అస్తవ్యస్తంగా బదిలీ, పోస్టింగ్స్
- 12 మంది ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 75 రోజుల వ్యవధిలోనే ముగ్గురు పోలీసు కమిషనర్లను బదిలీ చేసింది. ఇతర పోలీసు అధికారులను కూడా మార్చుతూ గందరగోళం సృష్టిస్తున్నది. తమను ప్రభుత్వం ఏ ప్రాతిపదికన బదిలీ చేస్తున్నదో తెలియడం లేదని సదరు అధికారులు వాపోతున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో డీఎస్ చౌహాన్‌ను రాచకొండ పోలీసు కమిషనర్‌గా నియమించారు. కొద్ది రోజుల్లోనే ఆయనకు సివిల్ సప్లై కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. రాచకొండ కమిషనర్‌గా సుధీర్‌బాబును నియమించారు. సోమవారం మళ్లీ సుధీర్‌బాబు ను తప్పించి డాక్టర్ తరుణ్‌జోషికి సీపీగా బాధ్యతలు అప్పగించారు. ఎల్ఎస్ చౌహాన్‌ను జనవరి 3న రామగుండం పోలీస్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చిన ప్రభుత్వం.. సోమవారం ఆయనను జోగులాంబ జోన్-7 డీఐజీగా బదిలీ చేసింది. రామగుండం కమిషనర్‌గా ఎం శ్రీనివాసులును నియమించింది. జనవరి 3న జోయల్ డేవిస్‌కు జోగులాంబ జోన్-7 డీఐజీగా పోస్టింగ్ ఇచ్చి.. తరువాత వెయిటింగ్‌లో పెట్టారు. తాజాగా ఉత్తర్వుల్లో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా నియమించారు. రెండున్నర నెలల్లోనే బదిలీలు చేపట్టడంతో అధికారుల్లో గందరగోళం నెలకొన్నది.

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
జీ సుధీర్‌బాబు	పోలీస్ కమిషనర్, రాచకొండ	ఐజీ, మల్టీజోన్-2 (మల్టీ జోన్-1 అదనపు బాధ్యతలు)
డాక్టర్ తరుణ్‌జోషి	మల్టీజోన్-2 ఐజీ (మల్టీజోన్-1 ఐజీ, ఎఫ్ఎసీ)	పోలీస్ కమిషనర్, రాచకొండ
ఎం శ్రీనివాసులు	వెయిటింగ్	పోలీస్ కమిషనర్, రామగుండం
ఎల్ఎస్‌చౌహాన్	పోలీస్ కమిషనర్, రామగుండం	డీఐజీ, జోగులాంబ, జోన్-7
జోయల్ డేవిస్	వెయిటింగ్	జాయింట్ కమిషనర్, ట్రాఫిక్, సైబరాబాద్
కే నారాయణ్‌నాయక్	జాయింట్ కమిషనర్, ట్రాఫిక్, సైబరాబాద్	డీఐజీ, ఎస్‌సీఆర్‌బీ, సీఐడీ, హైదరాబాద్
కే అపూర్వారావు	ఎస్పీ, సీఐడీ, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్	ఎస్పీ (విజిలెన్స్), టీఎస్‌ఆర్టీసీ, హైదరాబాద్
డీ ఉదయ్‌కుమార్‌రెడ్డి	ఎస్పీ, టీఎస్ ట్రాన్స్‌కో	డీసీపీ, సౌత్ వెస్ట్ జోన్, హైదరాబాద్ సిటీ
ఆర్ గిరిధర్	డీసీపీ, ఎస్‌వోటీ మల్కాజిగిరి, రాచకొండ	డీసీపీ, ఈస్ట్ జోన్, హైదరాబాద్ సిటీ
డీ మురళీధర్	వెయిటింగ్	డిప్యూటీ డైరెక్టర్, ఆర్‌జీఐఆర్‌ఆర్, తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ
డాక్టర్ జీ నవీన్‌కుమార్	డిప్యూటీ డైరెక్టర్, ఆర్‌జీఐఆర్‌ఆర్, తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ	రిపోర్ట్ టు డీజీపీ ఆఫీస్
సాధనా రష్మి పెరుమళ్	అడిషనల్ డీసీపీ, రాజేంద్రనగర్, సైబరాబాద్	డీసీపీ, టాస్క్‌ఫోర్స్, హైదరాబాద్ సిటీ

పలువురు నాన్‌క్యాడర్ ఎస్పీలు, ఏఆర్ ఏఎస్పీల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఐదుగురు నాన్ క్యాడర్ ఎస్పీలు, 39 మంది నాన్ క్యాడర్ ఏఆర్ ఏఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ జితేందర్ ఉత్తర్వులిచ్చారు.

నాన్-కేడర్ ఎస్పీలు..

	అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
1.	బీ సాయి శ్రీ	డీసీపీ, ఈస్ట్‌జోన్ హైదరాబాద్	డీసీపీ, ఎస్‌బీ సైబరాబాద్
2.	జే అశోక్‌కుమార్	డీసీపీ, ఎస్‌బీ సైబరాబాద్	ఎస్పీ, సీఐడీ
3.	బీ శ్రీ బాలాదేవి	డీసీపీ, టాస్క్‌ఫోర్స్, హైదరాబాద్	డీసీపీ, ఎస్‌వోటీ, మాదాపూర్
4.	ఎంప రషీద్	డీసీపీ, ఎస్‌వోటీ, మాదాపూర్	ఎస్పీ, ఇంటెలిజెన్స్
5.	జే జగదీశ్వర్‌రెడ్డి	ఎస్పీ, సీఐడీ	ఎస్పీ, ట్రాన్స్‌కో

నలుగురు ఐఏఎస్ అధికారులు..

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేసింది. నిజామాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చిత్రమిశ్రాను ఏటూరు నాగారం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా బదిలీ చేసింది. అక్కడ పనిచేస్తున్న అన్కిట్‌ను నిజామాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బదిలీ చేసింది. ఆదిలాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుష్బూగుప్తాను ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా, సెలవుల్లో ఉన్న చహత్ బాజ్‌పాయిని జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశిస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

పంచాయతీరాజ్‌లో 105 మంది..

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖలో భారీస్థాయిలో అధికారుల బదిలీలను చేపట్టారు. రెండ్రోజుల్లో 563 మందికి స్థానచలనం కల్పించారు. దాదాపుగా జిల్లా స్థాయి అధికారులందరినీ బదిలీ చేశారు. ఆదివారం 395 మంది ఎంపీడీవోలను బదిలీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. సోమవారం 105 జిల్లా పరిషత్ సీఈవోలు, డిప్యూటీ సీఈవోలు, డీఆర్‌డీవోలు, డీపీవోలు, 39 మంది డీఎల్‌పీవోలను, 24 మంది అడిషనల్ డీఆర్‌డీవోలను బదిలీ చేసింది.

110 మంది డీఎస్పీల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) ః రాష్ట్రంలో భారీగా పోలీసు అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 110 మంది డీఎస్పీలు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ రవి గుప్తా సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

గురుకుల టీచర్లకు పదోన్నతులివ్వాలి : పీఆర్జీటీఏ

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో టీచర్ల భర్తీకి ముందే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని పీఆర్టీయూ టీఎస్ అనుబంధ సంస్థ పీఆర్జీటీఏ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

ఎక్సైజ్ శాఖలో భారీగా స్థానచలనం

9 మంది అసిస్టెంట్ కమిషనర్లు, 14 మంది ఎస్పీలు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల నేపథ్యం లో తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో 9 మంది ప్రొహిబిషన్ ఎఅండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్లు, 14 మంది సూపరింటెండెంట్లు ఉన్నారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు.

అసిస్టెంట్ కమిషనర్ల బదిలీల వివరాలు

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కే వరప్రసాద్	బేవరీజ్, ఏసీ	కరీంనగర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ
ఏ అజయ్‌భాస్కర్‌రెడ్డి	కరీంనగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ	మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ
ఆర్ కిషన్	నిజామాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ	రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ
జీ శ్రీనివాసరెడి	ఆదిలాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ	మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ
ఏ చంద్రయ్య	రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ	ఏసీ బేవరీజ్
హెచ్ దత్తురాజ్‌గౌడ్	మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ	చీఫ్ మేనేజర్ టీఎస్‌బీసీఎల్ రంగారెడ్డి-1
వీ సోమిరెడి	చీఫ్ మేనేజర్ టీఎస్‌బీసీఎల్ రంగారెడ్డి-1	నిజామాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ
కే రఘురామ్	మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ	డీసీ హెడ్‌క్వార్టర్స్ సీపీఅండ్ఈ
ఏ శంభూ ప్రసాద్	నల్లగొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ	డీసీ కంప్యూటర్స్ సీపీఅండ్ఈ

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.